# బీహార్, తమిళనాడులలో నక్సల్బరీ అమరుల సంస్మరణ సభలు

**చారిత్రక** నక్సల్బరి రైతాంగ తిరుగుబాటు సందర్భం మే 25న ఏఐకెఎంకెఎస్ బీహార్ కమిటి ఆధ్వర్యంలో పాట్నాలో సభను జరిపారు. 'నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు వెలుగులో ప్రస్తుత రైతాంగ పోరాటాలు, రైతాంగ విముక్తి' అంశంపై జరిగిన ఈ సభలో వివిధ విభాగాలకు చెందిన రాష్ట్రస్థాయి నాయకులు కామ్రేడ్స్ ఎస్.డి. బోస్, అశోక్ బైతా, నందకిషోర్‌సింగ్, శ్యాంసుందర్ భగత్‌లు ప్రసంగించగా కా॥ ఉదయ్ చౌదరి అధ్యక్షత వహించారు.

సిపిఐ(ఎం-ఎల్) సిఇసి సభ్యులు కా॥ అరవిందసిన్హా మాట్లాడుతూ నక్సల్బరీ ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. నక్సల్బరీ రైతాంగ ఉద్యమం చారిత్రక విప్లవ రైతాంగ ఉద్యమమని, తెలంగాణా, తెబాగా, పునప్ర-వాయలార్ ఉద్యమాల విశిష్ట వారసత్వాన్ని ముందుకు కొనసాగించటంలో ఈ పోరాటం ఒక శక్తివంతమైన పాత్ర నిర్వహించిందన్నారు. ప్రస్తుత వ్యవస్థను కూలదోసేందుకు ఉద్దేశించిన మహత్తర పోరాటమన్నారు.

కా॥ అశోక్ బైతా ఏఐకెఎమ్‌కెఎస్ తరఫున కీలకపత్రాన్ని సమర్పించారు. ఈ సభలో ఇంకా ఏఐఎఫ్‌టియు(న్యూ) ఝార్ఖండ్ నాయకులు కా॥ శియాశరణ్ శర్మ, భారతీయ కిసాన్ సభ బీహార్ ప్రాంతీయ సహాయకార్యదర్శి ఉమేష్‌సిన్హా, బీహార్ కిసాన్ సమితి నాయకులు కా॥ బలదేవ్ ఝా, ఐఎఫ్‌టియు(సర్వహార) నాయకులు కా॥ అజయ్‌సిన్హా, నాగరిక అధికార రక్షామంచ్ నాయకులు కా॥ సంజయ్ శ్యామ్ తదితరులు మాట్లాడుతూ నక్సల్బరీ రైతాంగ అమరులకు నివాళులర్పించారు.

★ ★ ★

నక్సల్బరీ అమరులను స్మరించుకుంటూ **తమిళనాడు రాష్ట్రం – తిరుపనందల్‌లో** మే 25న అమరుల సంస్మరణసభ సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో పార్టీ నాయకులు కామ్రేడ్స్ అంబరసన్ కటియా, వేల్‌రాజ్, కరుణాకరన్, అన్నాదురై, సుందర వినయగం, మరియు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కార్యదర్శి కా॥ ఎం. గుణలన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 1967లో వసంతకాల మేఘ గర్జనలా నక్సల్బరీ ముందుకొచ్చిందని, కామ్రేడ్స్ కానుసన్యాల్, జంగల్ సంతాల్, ఖోకన్ మజుందార్‌లు టీ తోటల కార్మిక, రైతాంగాన్ని సంఘాలలోకి సమీకరించి యాజమాన్యానికి, జోతేదార్లకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారన్నారు. మే 25న రైతాంగ ఉద్యమంపై పోలీసులు కాల్పులు జరిపి ఒక పసిబిడ్డతో సహా 12 మందిని బలిగొన్నారని తెలిపారు. అమరుల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత ముందుకు కొనసాగించాలన్నారు. కా॥ కందస్వామి సమావేశాన్ని ముగించారు.

★★★★★